62

# అలవాటు దోషం

బాల్కనీలో కూర్చుని న్యూస్ పేపర్ చదువుకుంటున్నాడు ప్రకాశరావు.

అతని భార్య నిర్మల ఇల్లంతా ఊడ్చి చెత్తని ప్లాస్టిక్ బుట్టలో వేసింది. బాల్కనీ దగ్గరకు వచ్చి, మేడమీద నుంచే ఆ బుట్టను నేల మీదికి వంచేసింది.

గాలికి కొన్ని కాగితాలు తిరిగి బాల్కనీలోకే వచ్చేశాయి. మిగిలిన చెత్త, తరిగిన కూరముక్కలు, దుమ్ము రోడ్డు మీద పడింది.

"కొంచెం క్రిందికి వెళ్లి చెత్తకుండీలో వేస్తే బాగుంటుందిగా!" అన్నాడు ప్రకాశరావు.

"మళ్లీ అదో పని కూడానా– రోడ్డు మీదికి విసిరేస్తే పోయేదానికి! అయినా... మెట్లు దిగి క్రిందికి ఎవరు పోతారు?" అంది నిర్మల.

"ఎవరి నెత్తినైనా పడితేనో!" అన్నాడు ప్రకాశరావు కొంచెం చికాగ్గా.

"ఎందుకు పడుతుంది? ఏం పడదు. కింద నడిచేవాళ్ళు జాగ్రత్తగా నడవాలి. అయినా... అందరూ చేసే పనేగా ఇది!" అంటూ ఇంట్లోకి వెళ్లిపోయింది ఆమె.

ఇంక ఆమెతో మాట్లాడి లాభం లేదనుకుని ఊర్కుండిపోయాడు ప్రకాశరావు.

నాలుగు రోజులు గడిచాయి.

ఆ రోజు ఉదయం ఆరున్నర కావస్తోంది.

ఇల్లంతా దేనికోసమో వెతుకుతోంది నిర్మల.

ప్రకాశరావు లేచి ముఖం కడుక్కోబోతూ "ఏమిటి వెతుకుతున్నావు?" అని అడిగాడు.

"చంటిదాని వెండి ఉగ్గగిన్నె కనిపించడం లేదండీ. ప్రొద్దున్నే ఉగ్గు కూడా పెట్టాను" అంది నిర్మల ఆందోళనగా.



"అమ్మా... ప్రొద్దున చెల్లాయి దానిని పట్టుకుని పాకుతూ సావిట్లో తిరుగుతుంటే చూశాను. ఒకవేళ నువ్వు చీకటిలో దానిని కూడ ఊడ్చి అవతల పారేశావేమో!" అంది కూతురు కమల.

"అవున్లేవ్... అంతే చేసివుంటాను. ఇందాక ఊడుస్తూంటే ఏదో గల్లుమంది కూడాను. ఏ ఇనప ముక్కో అనుకున్నాను. నేను క్రిందకుపోయి వెతుక్కుని వస్తాను కాని, నువ్వుకొంచెం వంటిల్లు శుభ్రం చేయి" అంటూ క్రిందికి పరుగు తీసింది నిర్మల.

కమల వంటింట్లోకి వెళ్లింది.

క్రిందటి రోజు సాయంత్రం తరిగిన కూర పెచ్చులూ, మిగిలిపోయిన కాఫీ డికాషన్ మడ్డీ అన్నీ గిన్నెలోకి ఎత్తి బాల్కనీలోంచి వీధిలోకి విసిరేసి తిరిగివచ్చింది.

మరో నిముషంలో నిర్మల వగరుస్తూ పైకి పరుగెత్తుకు వచ్చింది. ఒళ్ళంతా కాఫీ డికాషన్ మరకలు, నెత్తిమీద కూర చెక్కలతో "ఏమిటే... నువ్వు చేసిన పని?" అంటూ గర్జించింది.

"కింద చూడకుండా విసిరానమ్మా ... నీ మీద పడినట్లుంది !" అంది కమల భయం భయంగా.

అపుడే బాత్‌రూంలోంచి వస్తున్న ప్రకాశరావుకి ఆ దృశ్యం చూసే సరికి నవ్వు ఆగలేదు.

"అందుకే వీధిలోకి చెత్త విసరకూడదంటాను. ఇది నీకయింది కాబట్టి సరిపోయింది. ఇదే ఇంకెవరిమీద అయినా పడివుంటే పెద్ద గొడవైపోయివుండేది" అన్నాడు.

నిర్మల ఏమీ మాట్లాడలేక బాత్‌రూం వైపు వెళ్లిపోయింది.

"అమ్మా... ఉగ్గుగిన్నె వంటింటి మోరీలో దొరికింది" అంది కమల.

"సరేలే... బట్టలు తీసుకురా!" అని బాత్‌రూంలోంచి అరిచింది నిర్మల.

★★★

